క్లుప్తంగా

డాక్టర్ స్వర్ణలతకు అవార్డు



అవార్డు అందుకుంటున్న స్వర్ణలత

పాలకోడేరు: విస్సాకోడేరు సెయింట్ జాన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ డి.ఆర్.స్వర్ణలతకు మహాత్మాగాంధీ జాతీయ అవార్డు లభించింది. గత 22 ఏళ్లుగా ఆమె చేస్తున్న సామాజిక సేవను గుర్తించి స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ఆదర్శ వెల్ఫేర్ సొసైటీ తాడేపల్లిగూడెం డైరెక్టర్ రొక్కలా నాగబుజ్జి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో ప్రదానం చేశారు. స్వర్ణలతకు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు ఆకివీడులో ‘గడపగడపకు’

ఆకివీడు : ఆకివీడు నగర పంచాయతీ పరిధి సచివాలయం-3లోని ఒకటోవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జి.కృష్ణమోహన్ మంగళవారం చెప్పారు. కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు హాజరవుతారని తెలిపారు.

కోరుకొల్లులో స్వాతంత్య్ర సంబరాలు

పాలకోడేరు: కోరుకొల్లులోని ఆజాది కా అమృత్ మహోత్సవ్ స్థూపం వద్ద రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్, తణుకు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మంతెన యోగీంద్ర కుమార్ (బాబు) ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేకూరి ఆంజనేయరాజు, ఎంపీటీసీ సభ్యురాలు తంగెళ్ల మంజుల, వార్డు సభ్యులు పాల్గొన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



ఉండిలో స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్

ఉండి: ఉండిలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి జిల్లా ఎస్పీ మంగళవారం స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన గ్రామ పంచాయతీ కేటాయించిన స్థలంలో త్వరలోనే పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం చేపట్టబోతున్నట్లు సీఐ సత్యనారాయణ, ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు. దీనిలో భాగంగానే ప్లాన్, అంచనాలపై ఎస్పీ పరిశీలన చేసినట్లు వారు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళాకేంద్రంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు కళాకారులచే నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పాఠశాలల చిన్నారులచే దేశభక్తి బృంద నృత్య పోటీలు, కళాకారులచే ట్రాక్ సింగింగ్, అనంతరం సభ కార్యక్రమం జరిగింది. మర్ల విశ్వనాథశర్మకు గౌరవ పురస్కారం, సప్పా భారతి భగవతార్‌కు హరికథా రత్న పురస్కారం, కళాహస్తి నాగరాజుకు ఆర్థిక సత్కారం చేశారు. బీవీఆర్ కళాకేంద్రం సభ్యులు, సాహితీ ప్రముఖులు, కళాకారులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ఆవిష్కరణ

తణుకు అర్బన్: తణుకుకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహావిష్కరణల కార్యక్రమం బుధవారం తణుకు బ్యాంక్ కాలనీలోని స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంలో నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ తెలిపారు. 17 మంది సమరయోధుల విగ్రహావిష్కరణలతోపాటు వారి కుటుంబసభ్యులకు నిర్వహించే సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథి రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులమీదుగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

తేతలిలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

తణుకు టౌన్: మండలం తేతలి గ్రామ పంచాయతీలో జరిగే 8వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. తేతలి గ్రామంలోని 8వ వార్డు సభ్యుని అభ్యర్థులు ఉన్న అభ్యర్థులకు మద్దతుగా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు తమ అభ్యర్థులతో కలసి ఇంటింటికి తిరిగి తమ గుర్తుపైనే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. వైసీపీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థి కోట వెంకటేష్‌తో పార్టీ మండల ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు.

గాంధీ ఆశయాల సాధన దిశలో సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- వైభవంగా 77వ స్వాతంత్య్ర దినోత్సవం
- వాడవాడలా వైభవంగా సంబరాలు



భీమవరం క్యాంపు కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో త్యాగధనులకు నివాళులర్పిస్తున్న దృశ్యం



భీమవరం: కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జడ్జి శ్రీసత్యాదేవి

సాక్షి, భీమవరం: మహాత్మా గాంధీ ఆశయాల సాధన దిశగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం క్యాంపు కార్యాలయంలో మంగళవారం 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీనివాస్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం జాతీయజెండాను ఎగురవేశారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, మావుళ్ళమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పాలపర్తి జోనా, కరిముల్లా, చెల్లబోయిన సూర్య ప్రకాష్, కానుబోయిన వెంకటరమణ, అల్లూరి నాగవల్లి, వేండ్ర విజయదుర్గ, ముత్యాల రామారావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ..

సాక్షి, భీమవరం: స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని భీమవరం తహసీల్దార్ కార్యాలయం, చైతన్య ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కొత్త బస్టాండ్ నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ వై రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎంశ్యామల, డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ పాల్గొన్నారు.



భీమవరం : యూనియన్ బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డ్స్‌కు బహుమతి ప్రదానం

యూనియన్ బ్యాంక్‌లో..

సాక్షి, భీమవరం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం రీజనల్ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రీజినల్ హెడ్ పి సంగీతకుమారి జెండా ఆవిష్కరించారు. అనంతరం సెక్యూరిటీగార్డ్స్, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌హెచ్‌లు ఎస్ఎస్‌పి వెంకటేశ్వరరావు, ఆర్ దివాకర్, పీఎన్‌డీ ఇన్‌చార్జ్ ఎస్‌వీవీ రమణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరువలేనివి

సాక్షి, భీమవరం: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరువలేనివని భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి శ్రీసత్యాదేవి అన్నారు. మంగళవారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టులో న్యాయశాఖ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీసత్యాదేవి పాల్గొన్నారు. న్యాయమూర్తులు బి అప్పలస్వామి, ఎ పవన్ కుమార్, జి సురేష్‌బాబు, డి ధనరాజు,బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం వెంకటరమణారావు, పిరమేశ్ బాబు పాల్గొన్నారు

స్వాతంత్ర్యోద్యమ పోరాట యోధులను ఆదర్శంగా తీసుకోవాలి

భీమవరం అర్బన్: ఎంతోమంది స్వతంత్య్ర సమర యోధుల త్యాగాల ఫలితమే మనం పీల్చుతున్న స్వేచ్ఛావాయువులని వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎంపీడీవో కె. వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు తిరుమాని తులసీరావు, కేతా నాగమణి, తిరుమాని ధనంజయరాజు, అధికారులు పాల్గొన్నారు.

- చినఅమిరంలో ఇమ్మాన్యుయేల్ చిల్డ్రన్స్ హోమ్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అగ్ని, వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
- యనమదుర్రు మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ బూరబత్తులు రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, దేవస్థానం చైర్మన్ పనసకర్ల మురళీకృష్ణ, మెల్లా రాంబాబు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హైస్కూళ్లు, సచివాలయాలు, మెయిన్ సెంటర్లలో 77వ పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



ఉండి: యండగండి గ్రంథాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



కాళ్ల: జెండా వందనం చేస్తున్న ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉండి: మండలంలో దేశ 77వ స్వాతంత్య్ర దినోత్సవ సంబరాల్లో ఊరువాడ జాతీయ పతాకం రెపరెపలాడింది. యండగండి శాఖా గ్రంథాలయం వద్ద సర్పంచ్ గోగులమండ చిన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ స్వాతంత్య్ర పోరాటం గురించి విద్యార్థులు, ప్రజలకు వివరించారు. మహదేవపట్నంలో 77 అడుగులు జాతీయ పతాకంతో గ్రామ సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ ముదునూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉండి రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ పాల్గొన్నారు. ఉండి జడ్పీ హైస్కూల్‌లో నల్లారి విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు, 3 నుండి 5వ తరగతి విద్యార్థులకు విద్యా సామాగ్రి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు చేతుల మీదుగా ట్రస్ట్ చైర్మన్ నల్లా సత్యకృష్ణ కిరణ్‌ప్రసాద్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ గుత్తుల కనకమహాలక్ష్మి వనిమా శ్రీనివాస్, కాళీపట్నం వపన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో స్వాతి, ఏవో ప్రభాకర్‌రావు, జడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, పెన్మెత్స విశ్వనాథరాజు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. కోపల్లె సొసైటీలో త్రిసభ్య కమిటీ చైర్మన్ వేగేశ్న జయ రామకృష్ణంరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. చిన్నారులు జాతీయగీతాలు ఆలపించారు. సొసైటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మూర్తి జెండాను ఆవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఏవీ కృష్ణారావు జెండా ఎగురవేశారు. పెద అమిరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. కోమటిగుంటలో సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ జెండా ఎగరవేశారు. పాఠశాల విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. కాంగ్రెస్ నాయకులు వేగేశ్న గోపాలకృష్ణంరాజు, అంకెం సీతారాం పాల్గొన్నారు.

శాంతి మార్గంతోనే విజయాలు

ఆకివీడు : శాంతి మార్గం ద్వారానే విజయాలు సాధ్యమని భారత స్వాతంత్య్ర ఉద్యమం ప్రపంచానికి చాటిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు చెప్పారు. స్థానిక రూరల్ బ్యాంక్, చేపల మార్కెట్ వద్ద జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి తదితరులు పాల్గొన్నారు. స్థానిక అయిభీమవరం టర్నింగ్ వద్ద వైసీపీ సీనియర్ నాయకుడు కనుమూరి అబ్బాయి రాజు, మండల పరిషత్ వద్ద ఎంపీపీ కఠారి జయలక్ష్మి,, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, పాఠశాలల వద్ద విద్యా కమిటీ చైర్మన్‌లు, పంచాయతీల వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆదిత్య విద్యార్థులు భారీ జాతీయ జెండాతో ఊరేగారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండల వ్యాప్తంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వీరవాసరం తూర్పు చెరువు వద్ద మండల వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో జాతీయ జెండా, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌లు పతాకావిష్కరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, గెద్దం భారతి, చికిలే మంగతాయారు, మానుకొండ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ స్కేటర్ చాంపియన్‌కు సత్కారం

ఆకివీడు: ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఏషియన్ స్కేటర్ చాంపియన్–2018 డాక్టర్ బి.మహేష్ వర్మ దంపతులను సిద్ధాపురం ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం సత్కరించారు. రోలర్ స్కేటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబర్చి ఇండియా తరఫున ఆసియా క్రీడల్లో పాల్గొని ఛాంపియన్‌గా నిలవడం తమ గ్రామానికే గర్వకారణమని ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు ప్రశంసించారు. గణపతి, తిమ్మరాజు పాల్గొన్నారు.

పెద్దిరాజు మృతదేహం యనమదుర్రు డ్రెయిన్‌లో లభ్యం

సాక్షి, భీమవరం: భీమవరంలోని యనమదుర్రు డ్రెయిన్‌లో గల్లంతైన కానుబోయిన పెద్దిరాజు (19) మృతదేహం మంగళవారం లభించిందని టుటౌన్ ఎస్సై పి అప్పారావు చెప్పారు. సోమవారం పట్టణానికి చెందిన నక్కా నవీన్ భీమవరం ప్రభుత్వాసుపత్రి సమీపంలోని కాలిబాట వంతెన వద్ద డ్రెయిన్‌లోనికి దూకాడు. దీనిని గమనించిన పెద్దిరాజు అతనిని రక్షించడానికి డ్రెయిన్‌లోకి దూకాడు. నవీన్ ఈదుకుంటూ గట్టుకు చేరగా పెద్దిరాజు గల్లంతయ్యాడు. మంగళవారం పెద్దిరాజు మృతదేహం డ్రెయిన్‌లో లభ్యంకావడంతో పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి పంపించారు. మృతుడి బావ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

జగనన్న ఇళ్ల నిర్మాణంలో విస్సాకోడేరు లేఅవుట్‌కు అవార్డు



భీమవరంలో ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టర్ ఏసుబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా భీమవరంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీల నిర్మాణానికి స్వాతంత్య్రదినోత్స వేడుకల్లో అవార్డు అందుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. విస్సాకోడేరు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేస్తున్నందున కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబు మంగళవారం కలెక్టర్ పి ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. అనంతరం ఏసుబాబు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలవడంతో ఆయన అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విస్సాకోడేరు లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో ఇప్పటికే రెండు వేలకు పైగా ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేయడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మహాయజ్ఞంలో భాగంగా భీమవరం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కాలనీల్లో రోడ్లు, మంచి నీరు, విద్యుత్, డ్రయిన్లు వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజా సమస్యలపై సీపీఐ బస్సు యాత్ర



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు భీమారావు

సాక్షి, భీమవరం: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ప్రజా సమస్యలపై సీపీఐ చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఈనెల 17, 18వ తేదీల్లో జిల్లాలో నిర్వహించే ప్రచార జాతా విజయవంతం చేయాలని మంగళవారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీపీఐ ఏరియా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17న విశాఖపట్నంలో యాత్ర ప్రారంభమై రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పర్యటిస్తామన్నారు. వచ్చే నెల 8న తిరుపతిలో నిర్వహించే భారీ బహిరంగ సభతో బస్సు యాత్ర ముగుస్తుందన్నారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, రూరల్ కార్యదర్శి ఎం సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలి



విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. భీమవరం మండలం తుందుర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్న విద్యార్థులకు సర్పంచ్ ఆరేటి వెంకట సత్య వీరస్వామి నాయుడు (పెద్దబ్బులు), స్కూల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరేటి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం మొదటి స్థానం దక్కించుకున్న యాతం భాగ్య నాగరత్న అమూల్యకు రూ.10 వేలు, రెండో స్థానం దక్కించుకున్న కోయ తేజశ్రీకి రూ.6 వేలు, మూడో స్థానం దక్కించుకున్న చందు హర్ష నవ్యశ్రీ కి రూ.4 వేలు నగదు బహుమతులు అందజేశారు. అదే గ్రామానికి చెందిన ఆరేటి వెంకట సత్యనారాయణ (బాబులు) తన అత్తమామలు గంధం శ్రీరామమూర్తి, ఝాన్సీ సీతారత్నం పేరిట మరో రూ.10 వేల నగదును ఎమ్మెల్యే శ్రీనివాస్ చేతుల మీదుగా బహూకరించారు. జడ్డు తాతాలు, ఆరేటి కాశి, ఆరేటి రాజు, రామకృష్ణ, కోయ నగేష్, దొరబాబు, వెంకట ప్రదీప్, స్కూల్ హెచ్ఎం కొల్లి సూర్యచంద్ర సాయిరాం, ఉపాధ్యాయులు జె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం క్షత్రియ యూత్ వింగ్, అల్లూరి సీతారామ రాజు సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను పట్టణంలోని ఏఎస్ఆర్ భవనంలో నిర్వహించారు యూత్ వింగ్ అధ్యక్షుడు వేగేశ్న అప్పల నర్సింహరాజు (నాని) మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 77 మంది యువకులు రక్తదానం చేశారని తెలిపారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు భీమవరం క్షత్రియ యూత్ వింగ్, శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా సమితి సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గాదిరాజు సుబ్బరాజు, సీహెచ్ సుబ్రహ్మణ్యరాజు, వి.గోపాలరాజు, సీహెచ్ ఝాన్సీలక్ష్మీ పాల్గొన్నారు.

దాతలు ముందుకొస్తే అభివృద్ధి వేగవంతం



పెన్నాడ హైస్కూల్లో కళావేదికను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

పాలకోడేరు: దాతలు ముందుకొస్తేనే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. పెన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు రూ.5లక్షలు వ్యయంతో నిర్మించిన గౌతమ బుద్ధరాజు కళావేదికను మంగళవారం ఆయన ప్రారంభించారు. మంతెన గౌతమ బుద్ధరాజు జ్ఞాపకార్థం కుమారులు మాజీ సర్పంచ్ మంతెన సుబ్రహ్మణ్యంరాజు, నారాయణరాజు, శ్రీనివాసరాజులు నిర్మించిన ఈ కళావేదిక విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంతో ప్రయోజనకరం అని అన్నారు. తొలు త స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను పీవీఎల్ ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, గొట్టు ముక్కల గోపాలకృష్ణంరాజు, సర్పంచ్ చిల్లా అనూష, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీతులసి, ఎంపీటీసీ సభ్యుడు ఆరేపల్లి పెద్ద వెంకటస్వామి, వైసీపీ నాయకులు ఇంటి బాబులు, పిల్లా శ్రీను, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.